క్లుప్తంగా

నేడు ఉపాధి హామీ పథకంపై ప్రజా వేదిక

వత్సవాయి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో 2021 ఏప్రిల్ ఒకటి నుంచి 2022 మార్చి 31 వ తేదీ వరకు జరిగిన పనులపై ఈ ఏడాది జనవరి 18 నుంచి గ్రామ పంచాయతీలలో సామాజిక తనిఖీలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం పది గంటల నుంచి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎస్వీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ హాజరు కావాలని కోరారు.

11వ వార్డులో కమిషనర్ పర్యటన

నందిగామ: నగర పంచాయతీ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని 11వ వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను గురువారం ఆయన పరిశీలించారు. స్థానిక ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్చార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ గురునాథం తదితరులు పాల్గొన్నారు.

94 శాతం పింఛన్ల పంపిణీ



పెనుగంచిప్రోలు: మండలంలో గురువారంతో సామాజిక పింఛన్ల పంపిణీ 94 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్ తెలిపారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తెల్లవారు జాము నుంచే పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నారన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పింఛన్లు లబ్ధిదారులకు అందిస్తోందన్నారు.

కంచికచర్లలో...

కంచికచర్ల: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో రెండవ రోజు గురువారం వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదు అందజేశారు. మండలంలో 10,227 మంది పింఛన్‌దారులుండగా 9,862 మందికి అంటే 98.32 శాతం మందికి పింఛన్‌లు పంపిణీ చేసినట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ బాలశంకర రావు తెలిపారు.

చెడు వ్యసనాల జోలికి పోవద్దు

జుజ్జూరు(వీరులపాడు): యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకనుగుణంగా ముందుకు సాగాలని నందిగామ రూరల్ సీఐ నాగేంద్రకుమార్ అన్నారు. మత్తు పదార్థాలు తీసుకోవటం వల్ల కలిగే అనర్థాలపై మండలంలోని జుజ్జూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఆయన అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. శ్రద్ధగా చదువుకుని తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరిగడ్డి వామి దగ్ధం

పెనుగంచిప్రోలు: స్థానిక చెరువుకట్ట వద్ద నిల్వ చేసిన ఆరు ఎకరాల్లోని వరిగడ్డి వామి దగ్ధమైన సంఘటన గురువారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం రైతు గజ్జి వెంకటేశ్వర్లుకు చెందిన వరిగడ్డి వామి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని మంటలు వ్యాపించి కాలిపోయింది. సమాచారం అందుకున్న జగ్గయ్యపేట ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. కాలిపోయిన వరిగడ్డి రూ.50 వేల వరకు ఉంటుందని రైతు వాపోయాడు.

విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ పథకంపై బీజేపీ నేతల హర్షం

జగ్గయ్యపేట అర్బన్: పార్లమెంట్ బడ్జెట్ సమావేశంలో ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ పథకం ప్రవేశపెట్టడంపై బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా గురువారం స్థానిక పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద బీజేపీ అనుబంధ చేతి వృత్తుల స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ చిత్రపటానికి, నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ రాజారామకృష్ణ వర్మ, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొప్పు సత్యనారాయణ, జిల్లా ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు సిమ్మసర్తి శ్రీనివాస్, బీజేపీ నాయకులు చేవూరి వెంకటాచారి, వేద సుబ్రహ్మణ్యం, స్వర్ణకారుల సంఘం నాయకులు బ్రహ్మోజు శశిధర్, పిన్నెల్లి నాగభూషణం, తూమాటి వీరాచారి, వెంకటరమణాచారి, వీరభద్రాచారి తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ ఆఫీస్ సెంటర్‌లో ప్రధాని నరేంద్రమోది చిత్రపటానికి బీజేపీ నాయకులు శ్రీకాంత్, కల్లూరి శ్రీవాణి, పచ్చిపాల నాగేశ్వరరావు, మేడూరి వెంకటేశ్వరరావు, శ్రీకృష్ణ, గణేష్, విశ్వరూపాచారి, రాఘవాచారి క్షీరాభిషేకం చేశారు.

మట్టిలో మాణిక్యాలు...క్రీడల్లో మెరికలు

- క్రీడల్లో రాణిస్తున్న గురుకుల పాఠశాల విద్యార్థులు
- పల్లె బిడ్డల ప్రతిభకు పదును
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం మెండు
- రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న పేదింటి బిడ్డలు



రిపబ్లిక్ డే పరేడ్‌లో మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్న గురుకుల పాఠశాల విద్యార్థులతో పీఈటీ ప్రసన్నకుమార్

పెనుగంచిప్రోలు: వారంతా రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన విద్యార్థులు. జగ్గయ్యపేటలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో క్రీడల్లో రాణిస్తూ విశేష ప్రతిభ కనపరుస్తున్నారు. రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొని ముఖ్యమంత్రి ఎదుట మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. వ్యక్తిగతంగా రాణించడమే కాకుండా పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు చేకూరుస్తున్నారు.

క్రికెట్‌లో రాణిస్తున్న రాజేష్



నల్లపు రాజేష్ స్వస్థలం నందిగామ మండలం రామిరెడ్డిపల్లి. తల్లిదండ్రులు నరసింహారావు, లూర్దమ్మ వ్యవసాయ కూలీలు. నిరుపేద కుటుంబంలో పుట్టిన రాజేష్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతూ జగ్గయ్యపేటలో శిక్షణ తీసుకుంటూ క్రికెట్‌లో ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నాడు. కేరళ రాష్ట్రంలో అండర్–14 సౌత్ జోన్ ట్రోఫీలో రాజేష్ అద్భుత ప్రతిభ ప్రదర్శించాడు. ఇటీవల గోవాతో జరిగిన మ్యాచ్‌లో 78 పరుగులు చేయటమే కాకుండా రెండు ఇన్నింగ్స్‌లలో 9 వికెట్లు పడగొట్టి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. కేరళతో జరిగిన మ్యాచ్‌లో ఒక వికెట్, 30 పరుగులు, పాండిచ్చేరితో జరిగిన మ్యాచ్‌లో మూడు వికెట్లు, 23 నాటౌట్‌గా నిలిచాడు. ఈ పోటీల్లో ఆంధ్రతో పాటు గోవా, కేరళ, కర్నాటక, హైదరాబాద్, పాండిచ్చేరి, తదితర రాష్ట్రాల జట్లు పాల్గొంటున్నాయి.

కబడ్డీలో బాబు ప్రతిభ



నెమలి బాబు స్వస్థలం జగ్గయ్యపేట మండలం బండిపాలెం. తల్లిదండ్రులు చిన్న స్వామి, నాగమణి వ్యవసాయ కూలీలు. బాబు గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. బాబు గ్రామీణ క్రీడ అయిన కబడ్డీలో విశేషంగా రాణిస్తున్నాడు. ఇటీవల విజయనగరం జిల్లా అలగోలులో జరిగిన స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ టోర్నమెంట్‌లో ఆడి విశేష ప్రతిభ కనపరిచాడు.

రిపబ్లిక్ డే పరేడ్‌లో పాఠశాల విద్యార్థులు

విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రిపబ్లిక్ డే పరేడ్‌లో పాఠశాలకు చెందిన 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించటం విశేషం. రాష్ట్రంలో మొత్తం 199 గురుకుల పాఠశాలలు ఉండగా కేవలం నాలుగు పాఠశాలల నుంచి మాత్రమే విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్‌కు ఎంపికయ్యారు.

పీఈటీ, కోచ్‌ల శ్రమ ఫలించింది



పేద కుటుంబాల నుంచి వచ్చి చదువుతో పాటు క్రీడలు, వివిధ అంశాల్లో విద్యార్థులు రాణించటం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యంగా తల్లిదండ్రుల ప్రోత్సాహం, పీఈటీ, కోచ్‌ల శ్రమ చాలా ఉంది. భవిష్యత్తులో విద్యార్థులు మరింత వృద్ధిని సాధించాలని కోరుకుంటున్నాం.

–టి.ఉమేష్‌బాబు, ప్రిన్సిపాల్, జగ్గయ్యపేట గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల

క్రీడలతో ఉపాధి అవకాశాలు



చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు ఎన్నో ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. పేద విద్యార్థుల్లో ఎంతోమంది ప్రతిభ ఉన్నవారు ఉన్నారు. అటువంటి వారికి పట్టణంలోని క్రికెట్ క్లబ్ ద్వారా శిక్షణ ఇస్తున్నాం. వారిలో రాజేష్ క్రికెట్‌లో ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నాడు.

–రాజేంద్ర, క్రికెట్ కోచ్

సంక్షేమం, అభివృద్ధే సీఎం జగన్ లక్ష్యం

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



కంచికచర్ల 18వ వార్డులో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల: అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం సుపరిపాలన అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండల కేంద్రమైన కంచికచర్ల 17, 18 వార్డులలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలుకరించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా అమలు చేస్తూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చుతున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. ఉన్నత కులాల్లోని నిరుపేదలకు సైతం ఆర్థికసాయం అందించడం, ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ, అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయటంతో పాటు ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచి వేల్పుల సునీత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాడుగుల శంకర్, ఎంపీటీసీ సభ్యుడు మాడుగుల మధుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు దేవరకొండ గురవయ్య, నారిశెట్టి శ్రీనివాసరావు, శేషం వాసుబాబు, మార్త శ్రీనివాసరావు, వేల్పుల శ్రీనివాసరావు,వేల్పుల రమేష్, తంగిరాల సృజనీకుమార్, మేకల బాబు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పెద్ద తిరునాళ్ల ఉత్సవాలు విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ సిద్ధారెడ్డి, పక్కన తహసీల్దార్ లక్ష్మీకల్యాణి తదితరులు

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మవారి పెద్ద తిరునాళ్ల ఉత్సవాలు అందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం వివిధ శాఖల అధికారులతో ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్సవాలు జరిగే రోజుల్లో తాగునీరు, పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆలయం వద్ద జరిగిన అగ్ని ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని దుకాణదారులు ఎవరూ గ్యాస్ సిలిండర్లు, పొయ్యిలు పెట్టవద్దని ఆదేశించారు. మరోసారి తనిఖీలు చేపడతామన్నారు. విద్యుత్ విషయంలో కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ కార్యాలయ ఏఓ సిద్ధారెడ్డి మాట్లాడుతూ అమ్మవారి కల్యాణ ఉత్సవాలకు సంబంధించి సచివాలయాల కార్యదర్శులు, సిబ్బందికి ప్రత్యేక విధులు అప్పగించామన్నారు. పారిశుద్ధ్యంపై తగు ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వీరభద్రరావు, ఆర్ఐ జనార్ధనరావు, ఇరిగేషన్ జేఈ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వార్డు సచివాలయం ఆకస్మిక తనిఖీ

సిబ్బందికి పలు సూచనలు చేసిన కమిషనర్



సచివాలయానికి వచ్చిన వారితో మాట్లాడుతున్న కమిషనర్ జయరాం

నందిగామ: సచివాలయానికి వచ్చిన వారితో సిబ్బంది మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని కమిషనర్ డాక్టర్ జయరాం సిబ్బందికి సూచించారు. పట్టణంలోని ఎనిమిదవ నంబరు సచివాలయాన్ని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయంలో సిబ్బంది మూమెంట్ రిజిస్టర్, సంక్షేమ పథకాల జాబితాలను పరిశీలించారు.అనంతరం సచివాలయానికి వచ్చే వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడంతోపాటు సచివాలయానికి వచ్చే వారితో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. ముఖ్యంగా సచివాలయం ద్వారా అందుతున్న సేవలను సకాలంలో అందేలా చూడాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్‌ను ఫాలో కావాలన్నారు.

సంపూర్ణ సహకారంతో స్వయం సమృద్ధి

- ప్రభుత్వ విప్ ఉదయభాను
- గౌరవరంలో రూ.70 లక్షల రుణాల పంపిణీ



డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు రుణాల చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

గౌరవరం(జగ్గయ్యపేట అర్బన్): సంఘ సభ్యుల పరస్పర సహకారంతో స్వయం సమృద్ధి పొందడమే లక్ష్యంగా సహకార సంఘాలు పని చేస్తున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. మండలంలోని గౌరవరంలో గురువారం సాయంత్రం వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రూ.35 లక్షల డ్వాక్రా రుణాలు, రూ.31.98 లక్షలు జగనన్న పాల వెల్లువ ద్వారా అక్క చెల్లెమ్మలకు రుణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఉదయభాను రుణాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ గౌరవరం గ్రామంలో సుమారు రూ.70 లక్షల రుణాలను సొసైటీ ద్వారా అక్కచెల్లెమ్మలకు, రైతులకు అందజేయడం సంతోషదాయకమన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత సహకార సంఘాలు మరింత బలోపేతం అవుతున్నాయని, రుణాలు పొందిన రైతులు, అక్కచెల్లెమ్మలు వాటిని సద్వినియోగం చేసుకొని స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. పంటల దిగుబడిని కూడా పెంచుకోవాలని, అదే విధంగా సొసైటీల ద్వారా తీసుకున్న రుణాలను ఎప్పటికప్పుడు చెల్లిస్తూ సంఘం అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు బాలసైదా, అన్నాబత్తుల శ్రీనివాసరావు, బూతుకూరి శ్రీనివాసరెడ్డి, అప్పిరెడ్డి, వడ్డెర సంఘం నాయకుడు వేముల మల్లేశ్వరరావు, నర్సిరెడ్డి, బొంతు రాంబాబు, మారుతి పెద్ద హుస్సేన్, జగదీష్, డేవిడ్, కత్తుల రమేష్, ఉడతల చిరంజీవి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్యామల పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

వీరులపాడు: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సేకరించిన సమాచారం మేరకు మండలంలోని పెద్దాపురం గ్రామానికి చెందిన బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి గురువారం ఎర్రుపాలెం నుంచి ద్విచక్ర వాహనంపై పెద్దాపురం వస్తుండగా, అదే సమయంలో కంచికచర్ల నుంచి ఎర్రుపాలెం వైపు వెళ్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటరెడ్డికి తీవ్ర గాయాలవటంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వృద్ధులు, వితంతువులకు నూతన వస్త్రాల పంపిణీ

బలుసుపాడు(జగ్గయ్యపేట అర్బన్): పవర్ ఆఫ్ హ్యూమానిటీ సోషల్ సేవా ట్రస్ట్, హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ మిషన్ వారి ఆధ్వర్యంలో గురువారం గ్రామంలోని పేద వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు జార్జి వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ ఏపీ సెక్రటరీ వేల్పుల రావుపాల్, ట్రస్టు సభ్యులు డాక్టర్ మధుబాస్కర్, ఎ.యశోద, ఎ.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



గజలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



గజలక్ష్మీ దేవిగా దర్శనమిస్తున్న సుఖ శ్యామలాంబ అమ్మవారు

నందిగామ: పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీ శుక శ్యామలాంబ సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మూడో రోజైన గురువారం స్వామి వారికి పలు రకాల విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని గజలక్ష్మీ దేవిగా అలంకరించి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళ పలు రకాల ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి వేళ స్వామి వారిని శేష వాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠా మహోత్సవాలు



ప్రతిష్ఠా మహోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న అభిషేకాలు

నందిగామ: పట్టణంలోని రామలింగేశ్వర నగర్‌లో గల సాయి అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో పలు దేవతామూర్తుల ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం గోపూజ, పలు రకాల హోమాది కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రతిష్ఠించబోయే విగ్రహాలు, ధ్వజస్తంభం లకు చందర్లపాడు మండలం రామన్నపేట సమీపంలోని కృష్ణానదిలో జలాధివాసం నిర్వహించారు. సాయంత్రం సమయంలో బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆయా పూజా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాల కోసమే ప్రేరణ

నందిగామ: పదవ తరగతి విద్యార్థులకు మెరుగైన ఫలితాల కోసమే ప్రేరణ ద్వారా ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని ఎంఆర్ఆర్ కళాశాల ఆవరణలో గురువారం బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో వసతిగృహాలలోని పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకే నిపుణులతో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని సబ్జెక్టులపై విద్యార్థులకు ఉన్న సందేహాలు నివృత్తి చెయ్యడంతో పాటు అన్ని సబ్జెక్టులలో ఉత్తమమైన ఫలితాలు వచ్చేలా శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి గోపాలకృష్ణ, పలు వసతి గృహాల నిర్వాహకులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ వారి కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు

ఫిబ్రవరి 5 నుంచి అమ్మవారి పెద్ద తిరునాళ్ల



పెద్ద తిరునాళ్ల ఏర్పాట్ల పరిశీలనలో ఆలయ ఈఓ లీలాకుమార్, చైర్మన్ చెన్నకేశవరావు తదితరులు

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవాలు(పెద్ద తిరునాళ్ల) ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు జరగనున్నాయి. గోపయ్య సమేత శ్రీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణంతో పాటు 41 రోజుల పాటు మండల దీక్ష చేపట్టిన వేలాదిమంది స్వాములు తిరుముడి సమర్పించి దీక్ష విరమించేందుకు తగిన ఏర్పాట్లు ఆలయ అధికారులు చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో అమ్మవారి కల్యాణానికి తరలివచ్చే అవకాశం ఉంది. ఈనెల 5న జరిగే శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మవారి కల్యాణానికి సంబంధించి ఏర్పాటు చేస్తున్న కల్యాణ వేదిక ప్రదేశంలో గురువారం ఆలయ వేద పండితులు, ఆలయ పురోహితులు ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో స్థల శుద్ధి పూజలు నిర్వహించారు. కల్యాణ మహోత్సవ ఏర్పాట్లను గురువారం ఆలయ ఈఓ జీవీడీఎన్ లీలాకుమార్, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు పరిశీలించారు. ఆలయం ముందు కల్యాణ వేదిక ఏర్పాట్లు, క్యూలైన్లు, మునేరు అవతల అమ్మవారి ఆలయ ఆడిటోరియంలో అన్నదాన ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయం ముందు ఈ ఏడాది ప్రత్యేకంగా లడ్డూ ప్రసాదాల కౌంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తలనీలాలు సమర్పించే షెడ్ వద్ద నాయీబ్రాహ్మణుల సమస్యలను విని సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఏఈఓ ఉమాపతి, కొండలరావు, ఏఈ రాజు, పాలకవర్గ సభ్యులు కోలా రామారావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్రం చేరుకోవటానికి మార్గాలు

పెనుగంచిప్రోలు పుణ్యక్షేత్రం చేరుకోవటానికి విజయవాడ నుంచి ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయి. పెనుగంచిప్రోలు నుంచి విజయవాడకు 70 కిలో మీటర్ల దూరం ఉంది. పెనుగంచిప్రోలుకు 17 కిలో మీటర్ల దూరంలో ఉన్న జగ్గయ్యపేట, నందిగామ నుంచి కూడా ఆర్టీసీ బస్సులు, ఆటోలు ఉన్నాయి. ఖమ్మం, మధిర నుంచి కూడా బస్సులు అందుబాటులో ఉన్నాయి.

మత్తుకు బానిసలైతే జీవితాలు ఛిద్రం

ఏసీపీ నాగేశ్వరరెడ్డి



నందిగామలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



అమ్రితసాయి ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లే రోడ్డులో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా... అని ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన పోలీసులు

నందిగామ: మత్తు పదార్థాలకు బానిసలైతే, జీవితాలు ఛిద్రమవుతాయని ఏసీపీ నాగేశ్వర రెడ్డి హెచ్చరించారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే తలెత్తే అనర్థాలు ప్రతి ఒక్కరికీ తెలియజేసే కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని కేవీఆర్ కళాశాల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని డ్రగ్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందన్నారు. యువత భవిష్యత్తు లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారని, యువత ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని సూచించారు. గంజాయితో పాటు ఇతరత్రా మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును పాడు చేస్తాయని, ఎందుకూ కొరగాని వారుగా సమాజంతో ద్వేషింపబడే వారుగా మార్చుతాయన్నారు. చివరకు ప్రాణాల మీదకు తెచ్చుకుని కుటుంబసభ్యులకు భారంగా మారతారన్నారు.యువత సన్మార్గంలో నడవాలని, దేశానికి ఉపయోగపడే మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. ఎస్‌హెచ్ఓ సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో ఎస్ఐ పండు దొర, కేవీఆర్ కళాశాల పి.డి నాగేశ్వరరావు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా... ఫ్లెక్సీ ఏర్పాటు

కంచికచర్ల: మండలంలోని పరిటాల అమ్రితసాయి, ఎంవీఆర్, మిక్ ఇంజినీరింగ్ కళాశాలల సమీపంలో జాతీయ రహదారి పక్కన డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా...అని కంచికచర్ల పోలీసులు ఫ్లెక్సీ ఏర్పాటుచేశారు.డ్రగ్స్ విక్రయించినా, కొనుగోలు చేసినా, డ్రగ్స్, మత్తు పదార్థాలు వాడినా టోల్‌ఫ్రీ నంబర్ 14500 కు ఫోన్ చేయాలని ఫ్లెక్సీలో సూచించారు. అంతకుముందు పరిటాల ముత్తవరపు వెంకటేశ్వరరావు ఇంజినీరింగ్ కళాశాలలో యాంటీ డ్రగ్స్ క్యాంపెయిన్‌పై సీఐ నాగేంద్రకుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సులభరీతిలో విద్యాబోధన చేయాలి



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఈవో చిట్టిబాబు

వీరులపాడు: విద్యార్థులకు అర్థమయ్యేలా సులభ రీతిలో ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని ఎంఈవో చిట్టిబాబు అన్నారు. మండలంలోని కొణతాలపల్లి, పల్లంపల్లి, జుజ్జూరు గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉపాధ్యాయులు మెరుగైన విద్యా బోధన చేయాలన్నారు. పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేయటంతో పాటు విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. నిరుపేదలకు సైతం ఉన్నత విద్యనందించాలనే సంకల్పంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని ఉపాధ్యాయులు కూడా అందుకనుగుణంగా పని చేయాలని ఆయన సూచించారు. అనంతరం కొణతాలపల్లి పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, ఆయా పాఠశాలల పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్‌లు పాల్గొన్నారు.